క్లుప్తంగా

జిల్లా కబడ్డీ మహిళా జట్టు ఎంపిక

నిజాంపేట్: మేడ్చల్ జిల్లా కబడ్డీ సీనియర్ మహిళా జట్టు ఎంపిక పూర్తయినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాసాని వీరేష్, ఎస్ఏటీఎస్ కబడ్డీ కోచ్ సుధాకర్‌రావులు ఓ ప్రకటనలో తెలియజేశారు. బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరిగిన ఈ ఎంపికకు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 100 మంది క్రీడాకారులు పాల్గొనగా తుది జట్టును ఎంపిక చేశారు. ఈ ఎంపికలో సీనియర్ పీఈటీ రాధిక ఆత్యా, పీఎస్టీ అకాడమీ మేనేజర్ షకీల్, సీనియర్ క్రీడాకారుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత కుట్టు శిక్షణ కేంద్రాలు



సర్టిఫికెట్లను అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి భవాని

చింతల్: నేడు మహిళలు అన్ని రంగాలలో తన ప్రతిభను కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకుంటున్నారని జూనియర్ సివిల్ జడ్జ్ భవాని అన్నారు. శుక్రవారం గణేష్‌నగర్‌లో లార్డ్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్, లక్ష్మి టైలరింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఆమె సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. మహిళలకు చేయూతను అందిస్తున్న సంస్థ ప్రతినిధులను ఆమె అభినందించారు. ఇలాంటి శిక్షణ కేంద్రాలు మధ్య తరగతి వారికి ఎంతో అండగా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్వాహకురాలు సాయిలక్ష్మి, టీచర్ పద్మజ, సంస్థ వ్యవస్థాపకుడు లయన్ కె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

3న బాలబృందావనం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం చిల్డ్రన్స్ వీక్లీ కార్యక్రమంలో భాగంగా 'బాలబృందావనం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 'ది గేమ్ ఆఫ్ కర్మా' పేరిట నిర్వహించే కార్యక్రమంలో 9 నుంచి 14 ఏళ్ళ లోపు పిల్లలకు పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.

అంతర్జాతీయ అనుసంధానమే లక్ష్యం

డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యం

రాయదుర్గం: పారిశ్రామికవేత్తలను అంతర్జాతీయ అనుసంధానం చేయడమే డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ లక్ష్యమని వక్తలు పేర్కొన్నారు. నానక్‌రాంగూడలోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని షెరటాన్ హోటల్‌లో శుక్రవారం రాత్రి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీరామ్ బిల్డర్ అండ్ డెవలపర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలాజీరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంటర్‌ప్రెన్యూర్ కమ్యూనిటీ బిల్డర్, జిమ్మీ మిస్త్రీ డెల్లా లీడర్స్ క్లబ్ హైదరాబాద్ చాప్టర్ బోర్డును ప్రకటించారు. అంత్యంత క్యూరేటెడ టెక్నాలజీ ఎనేబుల్డ్ గ్లోబల్ ప్లాట్‌ఫామ్ అయిన డెల్లా లీడర్స్ క్లబ్ అనేది విజ్ఞాన మార్పిడి, జీవనశైలి మార్గదర్శకత్వం, సామాజిక బాధ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల నాయకులకు మద్దతు ఇచ్చే పర్యావరణ వ్యవస్థను నిర్మిస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సెలేజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు ఎండీ సుహెల్ సేఠ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి బిపి ఆచార్య, ఐటీ నిపుణులు జేపీ చౌదరి, బజాజ్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సీఈఓ కరణ్ బజాజ్ ప్రసంగించారు.

అన్నమయ్య సంకీర్తనాలాపన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శుక్రవారం ది ఫ్యామిలీ మెన్ యువ దర్శకుడు రాజ్ నిడిమోరుకు చిత్రబ్రహ్మ బిరుదును శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జియర్ స్వామి అందజేశారు. యువ దర్శకుడు అందించిన ఫర్జీ, గో గోవా గాన్, డీ ఫర్ దోపిడి, సినిమా బండి, స్త్రీ వెబ్ సిరీస్ ద్వారా పేరు తెచ్చుకున్న చిత్రదర్శకుడు రాజ్ నిడిమోరుకి చిత్రబ్రహ్మ అనే బిరుదును అందజేశారు. అనంతరం శోభారాజు శిష్యబృందం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు.

రిటైర్ అయిన నెలలో పింఛన్ పత్రాలు మంజూరు

భవిష్యనిధి కమిషనర్ విశాల్ అగర్వాల్

పటాన్‌చెరు: పదవీ విరమణ పొందిన నెలలోనే పింఛన్ పత్రాలు మంజూరు చేస్తున్నామని భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలోని పీఎఫ్ కార్యాలయంలో నవంబర్‌లో 17 మందికి పింఛన్ మంజూరు చేయగా అందులో 9 మందికి పింఛను మంజూరు పత్రాలను అందజేశారు. ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ.. యాజమాన్యాలు, రిటైరయిన వారు పింఛను దరఖాస్తు ఫారమ్‌తో పాటుగా ఇతర సంబంధిత పత్రాలు జతచేసి సకాలంలో అందజేస్తే వారికి రిటైర్ అయిన నెలలోనే పింఛను మంజూరు పత్రాలను అందజేస్తామన్నారు.

త్రిముఖ పోటీలో గెలుపెవరిదో.?



కేపీ వివేకానంద్ బీఆర్ఎస్



కూన శ్రీశైలంగౌడ్ బీజేపీ



కొలను హన్మంత్‌రెడ్డి కాంగ్రెస్

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఎన్నికలు గురువారం ప్రశాతంగా ముగిశాయి. మొన్నటి వరకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు విస్తృత ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. గురువారం ఎన్నికలు పూర్తవ్వడంతో ఒక్కసారిగా కుత్బుల్లాపూర్ కింగ్ ఎవరు అనేది నియోజకవర్గంలో చర్చ జరుగుతోంది. కేపీ వివేకానంద, కూన శ్రీశైలంగౌడ్, కొలను హన్మంత్‌రెడ్డిలు ముగ్గురికి ముగ్గురు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నాప్పటికీ అంతర్గతంగా పోలింగ్ శాతం తగ్గడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

◆ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో నాటి ప్రధాన పార్టీల నుంచి కేపీ వివేకానంద్, కూన శ్రీశైలంగౌడ్, కొలను హన్మంత్‌రెడ్డిలు పోటీ పడగా కేపీ వివేకానంద్ విజయం సాధించారు. 2018లో కేపీ వివేకానంద్ టీఆర్ఎస్ నుంచి కూన శ్రీశైలంగౌడ్ కాంగ్రెస్, కాసాని వీరేశ్ బీజేపీ నుంచి పోటీ పడగా కేపీ వివేకానంద విజయం సాధించారు.

◆ ప్రస్తుతం 2023లో బీఆర్ఎస్ నుంచి వివేకానంద్, బీజేపీ నుంచి కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నుంచి కొలను హన్మంత్‌రెడ్డిలు పోటీ పడ్డారు. మారిన రాజకీయాల నేపథ్యంలో సమీకరణలు సైతం మారాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారో అనే అంచానాలు మాత్రం అంతు చిక్కడం లేదు.

◆ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని వివేకానంద్ భావిస్తుండగా.. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ గాలి, తెలుగుదేశం మద్దతు ఉండటంతో తాను సునాయాసంగా గెలుస్తానని హన్మంత్‌రెడ్డి ఆశాభావంతో ఉన్నారు. మోదీ చరిష్మా, జనసేన, ఎమ్మార్పీఎస్ మద్దతు, ప్రభుత్వ వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉన్నాయని దానికి తోడు పోల్ మేనేజ్‌మెంట్ పక్కగా జరిగిందని కూన శ్రీశైలంగౌడ్ ధీమాగా ఉన్నారు. అయితే డిసెంబర్ 3న ఎవరు కుత్బుల్లాపూర్ కింగ్ అనే విషయాలపై రాజకీయ పార్టీలతో పాటు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఓటర్లు ఎవరికి పట్టం కడతారో తేలాల్సి ఉంది.

పోలింగ్ సరళిపై వివిధ వర్గాల అంచనాలు.!

◆ కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో 6,99,130 ఓటర్లు ఉండగా అందులో 57.19 శాతం మాత్రమే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో అభ్యర్థుల్లో ఆందోళన కనిపిస్తోంది. 3లక్షల 63వేల పైచిలుకు ఓట్లు మాత్రమే పోల్ అయ్యాయి. దీంతో ఎవరకు లక్ష యాభై వేలకు పైగా ఓట్లు వచ్చిన అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలుపొందే అవకాశం ఉందని అంచనాలు వేస్తున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న లబ్దిదారులు,ముస్లిమ్,క్రిస్టియన్ ఓటర్లు తనకే ఓటు వేసి ఉంటారని బీఆర్ఎస్ అభ్యర్థి కెపి వివేకానంద్ భావిస్తున్నారు.ఇక కాంగ్రెస్ సంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు,టీడీపీ మద్దతుదారులు,తన సామాజిక వర్గం ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయని సునాయాసంగా గెలుస్తామనే అంచనలో కొలను హన్మంత్‌రెడ్డి ఉన్నారు.బీజేపీకి బలమైన ఓటు బ్యాంకుగా ఉన్న ఉత్తర భారతీయుల మద్దతు,జనసేన అండ, ఎంఆర్‌పిఎస్ మద్దతుతో పాటు తన క్యాడర్ ఓటు బ్యాంకుతో పాటు భారతీయ జనాత పార్టీ అభిమానులు ఇలా అన్ని రకాల ప్రయోజనం తనకు కలుగుతుందని కూన శ్రీశైలం గౌడ్ గెలుపు తథ్యామంటున్నారు.ఏది ఏమైన అభ్యర్థులు అంచనాలు అందుతాయా? లేక తలకిందులు అవుతాయా అనేది మాత్రం తెలాల్సి ఉంది.

బీఆర్ఎస్ నుంచి క్రాస్ ఓటింగ్!

◆ బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ నుంచి నియోజకవర్గంలో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తుంది. పార్టీలోనే ఉంటూ క్రాస్ ఓటింగ్ చేయడంతో బీఆర్ఎస్‌కు కొంత నష్టం జరిగే ప్రమాదం లేకపోలేదు? ఈ ఓటింగ్ కాంగ్రెస్‌కు మళ్లిందా? లేక బీజేపీకి చేరిందా? అనేది అంతు చిక్కడం లేదు. మొత్తానికి క్రాస్ ఓటింగ్‌కు పార్టీలోని కొంత మంది పాల్పడటం విశేషం. ఈ క్రాస్ ఓటింగ్ తమ పార్టీకి లబ్ధి చేస్తుందని కాంగ్రెస్ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డి, బీజేపీకి కలిసి వస్తుందని కూన శ్రీశైలంగౌడ్‌లు ఆశాభావంతో ఉన్నారు. ఏది ఏమైనా డిసెంబర్ 3న అసలు జాతకం బయట పడనుంది.

పోటీ రసవత్తరం

● గతంలో కంటే కాస్త పెరిగిన ఓటింగ్ శాతం ● కుత్బుల్లాపూర్ అభ్యర్థుల్లో మొదలైన ఆందోళన

నిజాంపేట్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన పోలింగ్ శాతంపై ప్రధాన పార్టీలు కూడికలు తీసివేతల్లో తలమునకలై ఉన్నారు. తమ పార్టీ అంటే తమ పార్టీ గెలుస్తుందని బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పేర్కొనడం గమనర్హం. పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా అంతర్గతంగా ఆందోళన చెందుతున్నారు. పోటీ త్రిముఖం కావడంతో అసలు ఎక్కడ ఏ పార్టీకు మెజారీటీ వస్తుంది అనే అంశాలను వివిధ వర్గాల నుంచి సమాచారం తీసుకుని విశ్లేసిస్తున్నారు. తక్కువ ఓట్ల మెజార్టీతోనైనా బయటపడతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎవరికి వారే ధీమాగా...

ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారని తన గెలుపు తథ్యమని కాంగ్రెస్ అభ్యర్థి కొలను హన్మంత్‌రెడ్డి ఆశాభావంతో ఉన్నారు. బీజేపీ పార్టీ అభ్యర్థి తమ పార్టీ గెలుపు కూన శ్రీశైలం గౌడ్ సైతం గెలుపుపై ధీమాతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే వివేకానంద్ ప్రతిపక్ష పార్టీలు ఓట్ల చీలికతో తమ పార్టీ సునాయాసంగా గెలుస్తుందని కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు. ఏది ఏమైనా కుత్బుల్లాపూర్‌లో పోటీ మాత్రం రసవత్తరంగా సాగింది.

గతంలో 55.84శాతం.. ఇప్పుడు 57.19శాతం

2018 ఎన్నికల్లో కుత్బుల్లాపూర్‌లో 55.84 శాతం పోలింగ్ జరుగగా 2023 ఎన్నికల్లో 57.19 శాతం పోలింగ్ అయ్యింది. నియోజకవర్గంలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా పోలింగ్ జరగడంతో పాటు పార్టీల ప్రభావం నియోజకవర్గం మొత్తం ఒకేలా ఉండకపోవడం అభ్యర్థులను టెన్షన్‌కు గురి చేస్తోంది. పోలైన మొత్తం ఓట్లలో 3,99,852 ఓటు హక్కు వినియోగించుకోగా అందులో పురుషులు 2,06,973, స్త్రీలు 1,92,828, ఇతరులు 51మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు.

ప్రాంతాల వారీగా పోలైన ఓట్లు..

కొంపల్లి మున్సిపాలిటీలో 19,608 ఓట్లు పోలయ్యాయి. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో 36,798 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సుభాష్‌నగర్ డివిజన్‌లో 30,114 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లో 32,951 ఓట్లు పోలైయ్యాయి. గాజులరామారం డివిజన్‌లో 23,136 మంది ఓటు వేశారు. సూరారం డివిజన్‌లో 28,631 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 67,647 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే విధంగా రంగారెడ్డినగర్ డివిజన్‌లో 27,421, చింతల్ డివిజన్‌లో 24,280, జగద్గిరిగుట్ట డివిజన్‌లో 31,185 మంది ఓట్లు వేశారు. కేపీ వివేకానంద్, కొలను హన్మంత్‌రెడ్డి, కూన శ్రీనివాస్‌గౌడ్‌ల గెలుపోటములను ఏ ప్రాంతం నిర్ణయించనుందోననే చర్చ విస్తృతంగా జరుగుతోంది.

42.81శాతం మంది ఓటింగ్‌కు దూరం

కుత్బుల్లాపూర్: అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ఆదివారం ఉదయం 8గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటికే కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు కీసర మండలం బోగారం హోలీ మేరీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 590 పోలింగ్ కేంద్రాల్లో 2,06,973 పురుషులు, 1,92,828 మహిళలు 51 మంది ఇతరులు మొత్తం 3,99,852 కలిపి 57.19 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

◆ **22 రౌండ్లు 28 టేబుల్లలో లెక్కింపు...**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 590 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. మొదట బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తి చేసి 8.30గంటల నుంచి ఈవీఎంల ఏర్పాట్లు చేస్తున్నట్లు పులి సైదులు పేర్కొన్నారు. మొత్తం 28 టేబుళ్ల ఏర్పాటు చేసి 22 రౌండ్లు లెక్కింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

◆ **42.81శాతం మంది ఓటింగ్‌కు దూరం..**

గడిచిన ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని చూస్తే కుత్బుల్లాపూర్‌లో ఓటర్లు తమ ఓటు హక్కును అధిక శాతం వినియోగించుకున్న 42.81 శాతం ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. మొత్తం 57.19 శాతం ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోగా 2018లో 56.05 కాగా, 2014లో 48.46 శాతం నమోదు అయ్యింది. అధికారులు పలు ప్రాంతాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోకపోవడం విశేషం.

లేడీస్ ఫస్ట్

◆ పురుషుల కంటే మహిళా ఓటింగ్ శాతం ఎక్కువ

దుండిగల్: మహిళల్లో చైతన్యం వెల్లివిరిసింది. వంటింటికే పరిమితం అన్న నానుడికి తెర దించుతూ ప్రస్తుతం అన్ని రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి నిరూపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. నియోజకవర్గంలో మొత్తం 6,99,130 మంది ఓటర్లు ఉండగా వారిలో 3,66,707 పురుషులు, 3,32,364 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,06,973, మహిళలు 1,92,828 మంది ఓటు వేశారు. పురుషులు 56 శాతం, మహిళలు 58 శాతం ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఓటర్లుగా తక్కువగా ఉన్నా మహిళలు రెండు శాతంపైగా పురుషుల కంటే ఆధిక్యంలో ఉన్నారు.

ఓటింగ్‌కు థర్డ్ జెండర్లు దూరం

దుండిగల్: అసెంబ్లీ ఎన్నికలకు థర్డ్ జెండర్లు దూరంగా ఉన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం 159 మంది ఉండగా 51 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూరారం కాలనీ, సుందర్ నగర్ ప్రాంతాల్లో ఉన్న వారు మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

రాయదుర్గం : ప్రస్తుత పరిస్థితి 'మనిషి వర్సెస్ మెషిన్' అన్నట్లుగా మారిందని మనూ వైస్‌చాన్స్‌లర్ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం నిర్వహిస్తున్న 'ఇంజనీరింగ్ (ఆర్ఐసీఈ-2023)లో ఇంటిలిజెంట్ కంప్యూటింగ్‌లో పరిశోధనలు' అనే అంశంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉర్దూ యూనివర్శిటీ, సెంట్రల్ అమెరికాలోని యూనివర్శిడాడ్ డాన్ బాస్కో సహకారంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రారంభసమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మనిషి మేధస్సు శాశ్వతమైన ఆధిపత్యాన్ని కలిగి ఉంటుందన్నారు. అనంతరం సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థుల భవితవ్యం

దుండిగల్: అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రంగా ఉంది. ఈనెల 30వ తేదీన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. మరో ఒక్క రోజులో ఎవరి భవిష్యత్ ఏంటో తెలిసిపోతుంది. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ నుంచి కొలన్ హన్మంత్ రెడ్డిలతో పాటు మరో 12 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

◆ నియోజకవర్గంలో మొత్తం 6,99,042 మంది ఓటర్లు ఉండగా వీరిలో 3,99,852 మంది తమ ఓటును వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఓటింగ్ సరళిని ప్రధాన పార్టీల అభ్యర్థులు నిశితంగా పరిశీలిస్తున్నారు. మొత్తం 590 బూత్‌లు ఉండగా ఆయా బూత్‌ల వారీగా జరిగిన పోలింగ్ శాతాన్ని బేరీజు వేసుకుంటున్నారు.

◆ తమ పార్టీ కేడర్, పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల పనితీరును వారు ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు సైన్యం నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నారు. గెలుపోటములను ప్రభావితం చేసే అంశాలను పరిశీలిస్తున్నారు. ఒక వైపు తామే గెలుస్తామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా లోలోపల మాత్రం గుబులు నెలకొంటోంది. మరో 24 గంటల్లో ఎవరి భవిష్యత్ ఎంటో తేలనుంది.

పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలు



పార్కులో పడేసిన మద్యం ఖాళీ సీసాలు

రంగారెడ్డినగర్: ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి. పార్కుల నిర్వహణ అటకెక్కించడంతో పాటు లైటింగ్ లేకపోవడంతో చీకటి పడిందంటే చాలు మందుబాబులు పార్కుల్లో చేరి మద్యం సేవిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. ఇళ్ల మధ్యనే ఉన్న ఈ పార్కులోకి జులాయిలు ప్రవేశించి చీకట్లో మద్యం సేవిస్తూ ఆపై బాటిళ్లను పార్కులోనే వదిలి వెళ్తున్నారు. ఇటు కాలనీ సంక్షేమ సంఘం పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఆకతాయిలు రెచ్చిపోతున్నారు. ఇప్పటికైనా పార్కులో లైటింగ్ ఏర్పాటు చేసి మందుబాబులను కట్టడి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అభ్యర్థుల్లో గెలుస్తామా లేదా అనే టెన్షన్

దుండిగల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల్లో తాము గెలుస్తామా.. లేదా అన్న టెన్షన్ నెలకొనడం సహజమే. కానీ ఇక్కడ విచిత్ర పరిస్థితి నెలకొంది. తమ అధినాయకుడి ముందు గప్పాలు కొట్టి ఎలాగైనా నిన్ను గెలుపిస్తాం అన్నా.. అంటూ ప్రగల్బాలు పలికి భారీ మొత్తంలో తాయిలాలు తీసుకున్న ద్వితీయ శ్రేణి నాయకులు, బూత్ ఇన్‌చార్జ్‌ల్లో వారి కంటే ఎక్కువ టెన్షన్ మొదలైంది. ఆయా బూత్‌ల వారీగా ఓటర్ల నాడిని పరిశీలించిన బూత్ ఇన్‌చార్జ్‌లకు ఇప్పుడు కంటి మీద కునుకు లేకుండా పోయింది. ఎన్నికల ఫలితాలు తారుమారైతే తమ పరిస్థితి ఏంటని తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రచారం, నామినేషన్, ఇతర ముఖ్య నాయకుల పర్యటనలు, బైక్ ర్యాలీల సమయంలో భారీగా డబ్బులు వసూలు చేసి ఓట్లు వేయించడంలో విఫలమయ్యామంటూ లోలోపల మదన పడుతున్నారు. ఆయా బూత్‌ల్లో తమ నాయకుడికి మెజార్టీ ఓట్లు రావాలని దేవుళ్లను వేడుకుంటున్నారు.

ప్రతిసారి విలక్షణ తీర్పు

● కుత్బుల్లాపూర్ ప్రజల తీర్పుపై ఉత్కంఠ ● ఒక్కరోజు ఆగితే తెలిసిపోనున్న ఫలితం

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఓటర్లు ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో విలక్షణ తీర్పు ఇస్తారు. మేడ్చల్ అసెంబ్లీలో అంతర్భాగంగా ఉండగా పునర్విభజనలో 2009లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంగా ఏర్పడింది. అప్పటి నుంచి జరిగిన మూడు పర్యాయాల ఎన్నికల్లో ప్రజలు విలక్షణ తీర్పు ఇచ్చారు. 2009లో జరిగిన మొదటిసారి ఎన్నికల్లో కూన శ్రీశైలంగౌడ్ (స్వతంత్ర), కేపీ వివేకానంద్ (బీఆర్ఎస్), కేఎం ప్రతాప్ (కాంగ్రెస్)లు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో శ్రీశైలంగౌడ్‌కు 53,753, వివేకానంద్‌కు 30,534, ప్రతాప్‌కు 26,312 ఓట్లు వచ్చాయి. శ్రీశైలంగౌడ్ 23,219 ఓట్ల మెజార్టీతో వివేక్‌పై గెలుపొందారు.

◆ అనంతరం 2014లో జరిగిన ఎన్నికల్లో వివేకానంద్(టీడీపీ), హన్మంత్‌రెడ్డి(బీఆర్ఎస్), శ్రీశైలంగౌడ్(కాంగ్రెస్) నుంచి పోటీ పడ్డారు. అందులో వివేకానంద్‌కు 1,14,363, హన్మంత్‌రెడ్డికు 75,339, శ్రీశైలంగౌడ్‌కు 40,283 ఓట్లు వచ్చాయి. హన్మంత్‌రెడ్డిపై 39,024 ఓట్ల మెజార్టీతో వివేకానంద్ విజయం సాధించారు.

◆ 2018లో జరిగిన ఎన్నికల్లో వివేకానంద్ (బీఆర్ఎస్) శ్రీశైలంగౌడ్(కాంగ్రెస్), కాసాని వీరేశ్(బీజేపీ)లు పోటీ చేశారు. ఇందులో శ్రీశైలంగౌడ్‌పై వివేకానంద్ 41,500 భారీ మెజార్టీతో విజయ ఢంకా మోగించారు.

◆ ప్రస్తుతం వివేకానంద్(బీఆర్ఎస్), కూన శ్రీశైలంగౌడ్(బీజేపీ),కొలన్ హన్మంత్‌రెడ్డి(కాంగ్రెస్) పార్టీల నుంచి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

◆ **పార్టీలు మారినా ఫలితం దక్కేనా..?**

ప్రస్తుతం బరిలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వివిధ పార్టీల నుంచి పోటీ చేసిన వారే వివేకానంద్ మొదటి సారి బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందగా టీడీపీ, బీఆర్ఎస్‌ల నుంచి రెండు సార్లు విజయం సాధించారు. మరోసారి హ్యాట్రిక్ సాధించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. 2009లో కూన శ్రీశైలంగౌడ్‌కు కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి భారీ మెజార్టీతో విజయం సాధించి అప్పట్లోనే రాష్ట్రంలో చరిత్ర సృష్టించారు.

◆ అనంతరం 2014, 18లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమిని చవి చూశారు. మొదటిసారిగా ఎమ్మెల్యేగా పని చేసి రెండు పర్యాయాలు ఓటమిపాలైన శ్రీశైలంగౌడ్ ఈ సారి ప్రజలు అవకాశం ఇస్తారని ఆశిస్తున్నారు. కాగా 2014లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన కొలన్ హన్మంత్‌రెడ్డి వివేకానంద్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దిగిన చివరి నిమిషంలో నామినేషన్ ఉపసంహరించుకుని అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీశైలంగౌడ్‌కు మద్దతుగా నిలిచారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ నుంచి తలపడ్డారు.

◆ **ముగ్గురి మధ్యనే ప్రధాన పోటీ..**

ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఎన్నికల ప్రచారంలోనూ హేమాహేమీలు వీరికి మద్దతుగా నిలిచారు. గతంలో 20 వేలు అంత కంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొందినా ప్రస్తుతం ఆ సీన్ కనిపించడం లేదు. నువ్వా.. నేనా అన్నట్లు సాగిన ఎన్నికల్లో విజయం ఎవరిని వరిస్తిందో మరో 24 గంటల్లో తేలనుంది.

యథేచ్ఛగా భవన నిర్మాణ వ్యర్థాల పారబోత



కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం సమీపంలో కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే మార్గంలో పారబోసిన డెబ్రిస్

రంగారెడ్డినగర్: ప్రధాన రహదారుల వెంబడి భవన నిర్మాణ వ్యర్థాల పారబోత నిరాటంకంగా కొనసాగుతోంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఇళ్ల నిర్మాణ వ్యర్థాలను సేకరించేందుకు పలు పాయింట్లను అధికారులు ఏర్పాటు చేసినా ఏ ఒక్కరూ నిబంధనలను పాటించడం లేదు. దీంతో కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు రహదారుల వెంబడి యథేచ్ఛగా వేస్తున్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న హెచ్ఎంటీ ఖాళీ స్థలానికి ఆనుకుని కుత్బుల్లాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన వ్యర్థాలను వేస్తున్నారు. ఇప్పటికైనా వ్యర్థాలను ఇష్టానుసారంగా బహిరంగ ప్రదేశాల్లో వేస్తున్న వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

విద్యావంతులు, వ్యాపారవేత్తలు ఉన్న ప్రాంతాల్లో..

తగ్గిన ఓటింగ్ శాతం

● ఓటు వేయాలని పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు ● అయినా ఆశించిన స్పందన రాని వైనం



దుండిగల్: 'ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి'.. అని రాష్ట్ర ఎన్నికల సంఘం, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు ఎన్నో ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయి. కానీ ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. మూడేళ్ల క్రితం కొత్తగా ఏర్పడిన దుండిగల్, కొంపల్లి, మున్సిపాలిటీలు, నిజాంపేట కార్పొరేషన్లలో ఓటింగ్ శాతం తగ్గాయి. విద్యావంతులు, వ్యాపారవేత్తలు, ఉన్నత ఉద్యోగులు అత్యధికంగా ఉండే నిజాంపేటలో పోలింగ్ తక్కువగా జరగడం నిరాశ కలిగించింది. మూడేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో వ్యత్యాసం కనిపిస్తోంది.

దుండిగల్‌లో 63 శాతం..

కొత్తగా ఏర్పడ్డ దుండిగల్ మున్సిపాలిటీలో 2020లో మొత్తం 44,313 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ప్రస్తుతం ఆ సంఖ్య 58,337కు చేరుకుంది. అప్పటి మున్సిపల్ ఎన్నికల్లో 68.81 శాతం నమోదు కాగా ప్రస్తుతం 63 శాతమే నమోదై 5 శాతం తగ్గింది.

కొంపల్లిలో 61 శాతం..

కొంపల్లిలో అప్పట్లో 24,892 ఓట్లు ఉండగా ప్రస్తుతం 32,108కు చేరింది. అప్పట్లో 66 శాతం నమోదు కాగా ప్రస్తుతం 61 శాతం నమోదై 5 శాతం ఓటింగ్ తగ్గింది.

నిజాంపేటలో 50 శాతం..

నిజాంపేటలో విచిత్ర పరిస్థితి ఉంటుంది. గత కొన్నేళ్ల క్రితం ఓ గ్రామానికి ఆమ్లెట్‌గా ఉన్న నిజాంపేట్ ఊహించని రీతిలో అభివృద్ధి చెందింది. నిజాంపేట్, బాచుపల్లి, ప్రగతినగర్ గ్రామాలను కలుపుతూ నిజాంపేట్ నగర పంచాయతీగా ఆవిర్భవించింది. 2020లో జరిగిన మొదటి సారి మేయర్ ఎన్నికల్లో 1,09,957 ఓటర్లు ఉండగా కేవలం 39 శాతమే పోలింగ్ నమోదైంది.

◆ ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 1,34,718 ఓట్లు ఉండగా 50 శాతమే ఓటింగ్ నమోదయ్యింది. ఉన్నత విద్యావంతులు, ఉద్యోగస్తులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వివిధ విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారే ఇక్కడ అత్యధికంగా నివసిస్తున్నారు. కాగా వీరే ఓటింగ్‌కు దూరంగా ఉండడం ఆందోళన కలిగించే విషయం.